వ్యాస కౌముది



## మనభారతం

డా.వల్లూరుపల్లి శివాజీరావు

79

**తొలి మాట:** *ప్రపంచ పాఠకులను విశేషంగా ఆకర్షించి, ఆకట్టుకుని, వారిచేత ఆదరించబడుచున్న, అసమాన తెలుగు మాస పత్రిక "**కౌముది**' లో ప్రచురితమైన నా 'మనభారతం' వ్యాసం జనవరి 2010 నుండి డిసెంబర్ 2015 వరకు నిరాటంకంగా 72 నెలలు ప్రచురితమయింది.* కాని సమయాభావం వల్ల జనవరి 2016 నుంచి కొన్ని బాధ్యతలవల్ల ఈ వ్యాసాలు కొనసాగించుటకు వీలు కాలేదు.

*ఇప్పుడు సమయం దొరికినందువల్ల 'కిరణ్ ప్రభ' గారి సమ్మతితో భారత విశేష చరిత్ర ను ప్రతిబింబించే ఈ 'మన భారతం' వ్యాసం ఈ సంచిక ద్వారా ఈ వ్యాసంతో మళ్ళీ కొనసాగిస్తున్నాను.*

# చేజారిన భారతదేశ రత్నరాజములు-7

### నీల-హరిత వజ్రం

### (Orlov/Orloff Diamond; ఓర్లోవ్ వజ్రం)



ఆంధ్రప్రదేశ్ లోని కొల్లూరు-పరిటాల వజ్రగనులనుంచి బయల్పడిన మరొక వజ్రరాజం **"ఓర్లోవ్ వజ్రం"** (ఓర్లోఫ్ వజ్రం). 189.62 క్యారెట్లు ఉన్న (47.6 mm ఎత్తు, 31.75 mm ఎత్తు, 34.92 mm పొడవు) ఈ వజ్రం నీల-హరిత (bluish-green) కాంతి వెదజల్లుతుంది. దీని ఆకారం పావురం అర్ధ-గుడ్డును పోలి ఉంటుంది. ఈ వజ్రం-గుడ్డు ఉపరితలం అనేక త్రికోణాకారపు వరుసలతో నిండియుంటే, దిగువభాగం సంబంధిత చతుర్ముఖ-కోణాకార వరుసలతో నిండియుంటుంది. ఈ కోణాలన్నీ కలిపితే 180 ఉంటాయి. వజ్రం ఒకవైపు కొంచెం చొట్ట (నొక్కు) ఉంటుంది.

కొల్లూరు వజ్రపు గనులనుండి ఈ నీల-హరిత వజ్రం ఎప్పుడు బయటపడిందో తెలియదు. కాని ఈ అద్భుత వజ్రం తమిళనాడులోని శ్రీరంగం పట్టణంలో ఉన్న రంగనాథస్వామివారి గుడిలో ఉన్న మహావిష్ణు విగ్రహంలో ఒక కన్నుగా అమర్చబడింది. ఈ గుడికి ఈ

కొల్లూరు వజ్రం ఎప్పుడు లభించిందో, ఎప్పుడు స్వామి వారికి కన్నుగా అమర్చబడిందో తెలియదు. కాని 17 వ శతాబ్దంలో ఒక ఫ్రెంచి సైనికుడు తన సైన్యంనుంచి బహిష్కరించబడిన తరువాత శ్రీరంగం నగరం దగ్గరలో ఒక చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. ఆసమయంలో స్వామివారి రెండు నేత్రాలలో రెండు అతిపెద్దవి, విలువకతీతమైన వజ్రాలు అమర్చబడ్డాయని అతనికి తెలిసింది.

వెంటనే ఈ వజ్రాలను దొంగిలించాలనే దుర్బుద్ధి పుట్టింది. ఎలా దొంగిలించాలనే విషయం గురించి కొన్ని సంవత్సరాలే ఆలోచించాడు. గుడికి ఏడు ప్రాకారాలుంటాయి. తాను క్రైస్తవుడు కాబట్టి తనను గుడి నాలుగవ ప్రాకారాన్ని దాటి లోపలికి పోనివ్వరని తెలుసు. అందువల్ల అతను హిందూమతాన్ని స్వీకరించి, కొన్ని నెలల తరువాత గుడి ఉన్న ప్రాకారంలో (మొదటి ప్రకారం) ఒక చిన్న ఉద్యోగం సంపాదించాడు.

మెల్ల మెల్లగా ఆలయ పురోహితుల నమ్మకాన్ని పెంపొందించుకుంటూ రంగనాధస్వామి మహత్తుకు పాదాక్రాంతుడయినట్లు నటిస్తూ అప్పుడప్పుడు గర్భ గుడిలోకి ప్రవేశించటానికి అనుమతి సంపాదించాడు. కొంత కాలానికి గర్భ గుడి కాపలాదారుడు, రక్షకుడి ఉద్యోగాన్ని పొందాడు. ఒకరోజు తాను ఎన్నాళ్ళగానో ఎదురుజూస్తున్న సమయం రానే వచ్చింది. ఉధృతంగా తుపాను వచ్చిన కాళ రాత్రి సమయాన ఈ ఫ్రెంచి మాజీ సైనికుడు, దీపాలను ఆర్పి, స్వామి వారి విగ్రహానికి ముసుగు కప్పి తన ఆపవిత్రమయిన, పాప పంకిలమయిన చేతులతో విగ్రహం కనుగుడ్డులో ఉన్న నీల-హరిత వజ్రాన్ని పెకలించాడు. మరొక కంటిలో ఉన్న మరో వజ్రాన్ని పెకలించే ధైర్యం లేక, దొరికిన వజ్రాన్ని పట్టుకుని పారిపోయాడు.

వెంటనే పారిపోతూ అన్ని ప్రాకారాల గోడలను ఎక్కి, దూకి, గుడి చుట్టూ ఉన్న కావేరీ, కొల్లిడం (Kolladam) నదులను ఈది దగ్గరలో తిరుచినాపల్లి లో తిష్టవేసిన బ్రిటిష్ సైన్య శిబిరాలలోకి పారిపోయాడు. అక్కడనుంచి చివరకు చెన్నపట్నం చేరాడు. అక్కడ ఒక బ్రిటిష్ సైన్య కెప్టెన్ కు రంగనాథస్వామి వారి కంటి వజ్రాన్ని 2,000 పౌండ్లకు (10,000 డాలర్లు) అమ్మాడు. ఈ బ్రిటిష్ కెప్టెన్ దీనిని ఇంగ్లడ్ కు తీసుకువెళ్లి 12,000 పౌండ్లకు (60,000 డాలర్లు) ఒక వజ్రాల వ్యాపారికి అమ్మాడు.

ఈ వజ్ర-వ్యాపారి ఈ వజ్రాన్ని "ఖోజ్ రఫెల్" (Khojeh Raphael) అనే ఆర్మేనియన్ వ్యక్తికి అమ్మాడు. అంతకు ముందు ఇతను కుర్రవాడిగా పర్షియా నుంచి మొదట గుజరాత్ లోని సూరత్ కి వెళ్లి, అక్కడనుంచి ఇంగ్లడ్ కు, తరువాత రష్యాకు చేరాడు. నీతి నియమాలులేని ఈ వ్యక్తి ప్రపంచంలో అనేక దేశాలు వెళ్ళాడు, అనేకభాషలు నేర్చుకున్నాడు.

ఇతని దగ్గరనుంచి ఈ వజ్రం 1768లో మరో ఆర్మేనియన్ వర్తకుడు "గ్రిగోరి సఫ్రాస్" (Grigori Safras) చేతుల్లోకి వెళ్ళింది. ఇతను Amsterdom లో తిష్ఠవేసి యూరోప్ లోని రాజులకు, రాజా వంశీకులకు నీల-హరిత వజ్రం, దాని గొప్పతనం గురించి సమాచారం అందించాడు. ఈ వజ్రం గురించి విన్న రష్యా రాణి "కాథరిన్ ది గ్రేట్" (Catherine the Great: పాలన 1762-1796) Safras ను రష్యా రాజధాని St. Petersburg కు ఆహ్వానించి, వజ్రాన్ని పరిశీలించి బేరం కుదర్చడానికి తన రాజ్యపు వజ్ర నిపుణుడు I.L. Lazarev ను నియమించింది. Safras అత్యధిక వెల పలికినందువల్ల బేరం కుదరలేదు. ఎన్ని రోజులయినా చర్చలు ఒక కొలిక్కి రాలేదు.

అప్పుడు Grigori Safras ను దారిలోకి తేవటానికి రాణి తన మంత్రి Count Panin ను నియమించింది. చతురుడైన ఈ మంత్రి సూక్ష్మబుద్ధి అయిన ఈ ఆర్మేనియన్ వ్యాపారిని మీద పై చెయ్యి సాధించటానికి అతనిని తన శక్తికిమించిన జీవన శైలికి అలవాటు చేసాడు. ఫలితంగా Safras చాలా అప్పులుచేయవలసివచ్చింది. చేసిన అప్పులు తీర్చలేని సమయంలో ఆర్మేనియన్ వ్యాపారిని అప్పులు తీర్చనంతవరకు రాష్యా విడిచి వెళ్ల రాదని మంత్రి ఆంక్ష విధించాడు.

అతితక్కువ ధరకు నీల-హరిత వజ్రాన్ని అమ్మటానికి ఇష్టంలేని Grigori Safras తనవద్ద ఉన్న ఇతర వజ్రాలను తనకు తెలిసిన ఆర్మేనియన్ వ్యక్తులకు అమ్మి, చేసిన అప్పులు తీర్చివేసి, St. Petersburg వదలి వెళ్ళాడు. కొన్ని ఏళ్లకు ఇతను దక్షిణ రష్యాలోని Astrakhan నగరంలో Safras నివసిస్తున్నాడని తెలిసి అతనితో రాణి సంప్రదింపులు ప్రారంభించినా బేరం కుదరలేదు.

కొన్నాళ్ళకు Grigori Safras Amsterdam తిరిగివెళ్ళిపోయాడు. ఆసమయంలో మన కొల్లూరు వజ్రం "Amsterdam Diamond" పేరు గాంచింది. రష్యా రాణి ఈ వజ్రం మీద మక్కువ తొలగించుకోలేక తన మాజీ ప్రియుడు Grigorievich Orlov (Orloff) ను నియమించి నీల-హరిత వజ్రాన్ని 1772 లో 400,000 రూబుల్స్ (90,000 పౌండ్లకు) కొనిపించింది.

యదార్థానికి Grigorievich Orlov కథెరిన్ రాణి అవటానికి ముందు ప్రియుడు. జులై 1762 లో Catherine భర్త, రష్యా రాజు అయిన "పీటర్ III " ను Orlov తిరుగుబాటు లేవదీసి ఆయనను పదవీచ్యుతుడిని చేసి, తరువాత చంపించి Catherine ను రాణిగా చేసాడు. రాణి అయిన తరువాత Catherine ఇతరుల ప్రభావంవల్ల Orlov ను పట్టించుకోలేదు. తీవ్ర అసంతృప్తికి లోనైన Orlov 1775లో దేశం విడిచి వెళ్ళి పోయాడు.

1772 లో తాను కొన్న నీల-హరిత వజ్రాన్ని Katherine కి బహుకరిస్తే తనను ఆమె సంతోషించి తిరిగి ప్రియుడిగా స్వాగతించగలదని భావించి ఆమెకు ఇచ్చాడు. ఈ వజ్రం మీద ఏంతో మక్కువ పెంచుకున్న రాణి సంతోషించి దీనిని తీసుకున్నా Orlov కు ప్రియుడి పాత్ర మాత్రం ఇవ్వలేదు. ఆమె మన రంగనాధస్వామి ధరించిన మణిని తన రాజ దండం (Spectre) లో మార్చబడేటట్టు చేసింది. Katherine కు చేసిన సహాయానికి ప్రతిఫలంగా Orlov కు St. Petersburg లో ఒక పాలరాతి భవనాన్ని బహుకరించింది. 1782లో తన భార్య మరణించినతరువాత మతి భ్రమించి, పిచ్చివాడైన Orlov మరుసటి సంవత్సరం మరణించాడు. కాని మన నీల-హరిత వజ్రం మాత్రం **Orlov Diamond** గా పేరొందింది శాశ్వతంగా.



ఇప్పటికీ ఈ రాజదండంలో నిక్షిప్తమై ఉన్న మన కొల్లూరు వజ్ర గనులనుంచి బయటపడ్డ రంగనాధ స్వామి నీల-హరిత వజ్రం ఉరఫ్ Orlov Diamond రష్యా రాజధాని మాస్కో లో Kremlin లో ఉన్న దేశ ఐశ్వర్య సంపదలో ఒక భాగమైంది.

(కొనసాగింపు వచ్చేనెలలో)

**మీ అభిప్రాయాలను పంపించేందుకు నా ఇ-మెయిల్: dr_vs_rao@yahoo.com**

COMMENTS